## క్లుప్తంగా

### 18న న్యూమరికా-2025



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 18వ తేదీన సిద్ధార్థ ఆడిటోరియంలో న్యూమరికా–2025 పేరుతో గణిత శాస్త్రం చదువుతున్న విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. ఈ పోటీల పోస్టర్‌ను కళాశాల సెమినార్ హాలులో శనివారం ఆవిష్కరించారు. రమేష్ మాట్లాడుతూ గణితానికి సంబంధించిన క్విజ్, గణిత రిలే రేస్, ట్రెజర్‌హంట్, గణిత కళ అండ్ ఒరిగామి, క్రియేటివ్ ఫొటోగ్రఫీతోపాటు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అదేరోజు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కళాశాల డీన్ రాజేష్ సీ జంపాల, గణిత విభాగాధిపతి ఐవీ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### క్యాన్సర్‌పై అవగాహన పెరగాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎముకలు, కండరాల్లో వచ్చే క్యాన్సర్‌లపై ప్రజల్లో అవగాహన పెరగాలని ప్రముఖ ఆర్థోపెడిక్ అంకాలజిస్ట్ డాక్టర్ కిషోర్ బీ రెడ్డి అన్నారు. పుష్పా హోటల్ సమీపంలోని ఓ ఆస్పత్రిలో నిర్వహించిన శిబిరంలో ఆయన ఎముకలు, కండరాల్లో వచ్చే క్యాన్సర్‌లు, ఎముకల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్స్, వాటి నివారణ గురించి రోగులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌లను మొదటి, రెండో స్టేజ్‌లో గుర్తిసే నయం చేయవచ్చన్నారు. ఇప్పుడు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అంతేకాకుండా డయాబెటిస్ ఇన్‌ఫెక్షన్‌లకు సైతం కాలు తొలగించకుండా నయం చేయవచ్చునని తెలిపారు.

### కార్మికులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు ఆరోపించారు. ఆటోనగర్‌లో సీపీఎం ప్రజా చైతన్య యాత్రను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ జవహర్ ఆటోనగర్ ఏర్పడి సుమారు 60ఏళ్లు అవుతున్నప్పటికి ఇక్కడి కార్మికులకు కనీసం తాగునీరు కూడా లేని విధంగా ఉందని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. సీపీఎం తూర్పునగర కార్యదర్శి పీ కృష్ణ, బీ చిన్నారావు, టీ చంద్రశేఖర్, కే రమణ, రవీంద్ర, వీబీ రాజు, నాగేశ్వరరావు, గురుమూర్తి, వరప్రసాద్ పాల్గొన్నారు.

### సెలవు రోజుల్లో పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీస్థలాలు, నీటి పన్ను చెల్లింపులు సెలవు దినాల్లో కూడా చెల్లించవచ్చని, క్యాష్ కౌంటర్లు అందుబాటులోనే ఉంటాయని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ పన్నులను వీఎంసీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అన్ని క్యాష్ కౌంటర్లలో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈనెల 31 వరకు నగర ప్రజలు తమ తమ అసెస్మెంట్లకు ఉన్న పన్నులు త్వరితగతిన చెల్లించి, వడ్డీ లేకుండా సకాలంలో చెల్లించాలని కోరారు. ఎక్కువ కాలం నుంచి పన్నులు చెల్లించని వారికి డ్రెయినేజ్ కనెక్షన్, తాగునీటి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు.

### వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం కొండ ప్రాంతంలో వేంచేసిన శ్రీ స్వయంబు శ్రీవల్లీదేవసేన సమేత కళ్యాణ సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలలో భాగంగా తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం గోపూజ, 8గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం, రక్షాబంధన, నవగ్రహ మండపారాధన, చతుర్ధ కలశ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని వేదిక వద్ద స్వామివారిని అమ్మవార్లను పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమాలను నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త తొత్తడి నాగరాజు దంపతుల పర్యవేక్షణలో గాదే సురేంద్రరెడ్డి దంపతులు, మాజీ కార్పొరేటర్ కొరికాని అనురాధ, మల్లేశ్వరరావులతోపాటు ఉభయదాతలు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

# చిరు వ్యాపారులపై ఎల్లో ట్యాక్స్

- రోడ్డు పక్కన వ్యాపారం చేయాలంటే కప్పం కట్టాల్సిందే
- అడిగినంత ఇవ్వకుంటే ఖాళీ చేయిస్తున్న వైనం



లబ్బీపేటలోని నందమూరిరోడ్డులో వ్యాపారాలు చేసుకుంటున్న చిరువ్యాపారులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బతుకు దెరువు కోసం రోడ్ల పక్కన వ్యాపారం చేసుకునే వారిని పచ్చ తమ్ముళ్లు పీడిస్తున్నారు. నెలనెలా తమకు ముడుపులు చెల్లిస్తేనే మీరు సజావుగా వ్యాపారాలు చేసుకోగలుగుతారంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇలా లబ్బీపేటతోపాటు పలు ప్రాంతాల్లో కూటమిలోని కీలక పార్టీకి చెందిన నేతలు ఎల్లో ట్యాక్స్ వసూలు చేస్తున్నట్లు పలువురు చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేమంటే ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉందంటూ స్టాల్స్‌ను తొలగిస్తూ మా వ్యాపారాలను దెబ్బకొడుతున్నారని పలువురు వాపోతున్నారు. ఇలా తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు.

**ఇవే నిదర్శనం**

- బృందావనకాలనీలోని నందమూరి రోడ్డులో కొన్నేళ్లుగా కొందరు రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇప్పుడు వారికి పోటీగా కొందరు అక్కడ స్టాల్స్ ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన వారి నుంచి ముందుగా కొంత మొత్తం తీసుకోవడంతోపాటు, నెలనెలా ఎల్లో ట్యాక్స్ చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది.
- లబ్బీపేట పైడియ్యా వీధిలో ఆరు నెలల్లో పదికి పైగా రోడ్డు పక్కన స్టాల్స్ వెలిశాయి. వారి నుంచి కూడా కూటమి పార్టీలో కీలక నేత ఒకరు ముడుపులు తీసుకుని ఏర్పాటు చేయించినట్లు తెలిసింది. అంతేకాదు నెలనెలా ఎల్లో ట్యాక్స్ చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు.

ఇలా ఈ రెండు ప్రాంతాల్లోనే కాదు తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో వీధి వ్యాపారులు ఎల్లో ట్యాక్స్ చెల్లించాల్సి వస్తోంది. ఒకవేళ ఎవరైనా ఇవ్వకపోతే వారిపై వేధింపులకు పాల్పడి, ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేయిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు.

**ప్రాంతాన్ని బట్టి రేటు**

చిరు వ్యాపారులకు స్థలం కేటాయించేందుకు ప్రాంతాన్ని బట్టి ఓ ధర వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. రద్దీగా ఉండే ప్రాంతమైతే ఒక రేటు, రద్దీ తక్కువగా ఉండే ప్రాంతమైతే ఒక రేటు చొప్పున వసూళ్లు చేస్తున్నారు. అంతేకాదు పలు కూడళ్లలో ఏర్పాటు చేసే ఫుడ్‌స్టాల్స్ వద్ద కూడా కూటమి నేతలు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాము బతుకుదెరువు కోసం చిరు వ్యాపారాలు చేసుకుంటుంటే, మా వద్దకు వచ్చి వసూళ్లు చేయడమేంటని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కప్పం కట్టాల్సి వస్తోంది**



రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకోవాలంటే చిరు వ్యాపారులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. రైతు బజారులో స్టాల్స్ కేటాయించాలన్నా, రోడ్డు పక్కన వ్యాపారం చేసుకోవాలన్నా నేతలకు కప్పం కట్టాల్సి వస్తోంది. ఎన్నడూ లేని విధంగా ప్రాంతాన్ని బట్టి వసూళ్లు చేస్తున్నారు. దీంతో బతుకుదెరువు కోసం వ్యాపారాలు చేసుకోవాలంటే ఇబ్బందిగా ఉంది.

– గద్దే కళ్యాణ్‌రామ్, పటమటలంక

# ప్లాస్టిక్ నిషేధం ప్రజల సహకారంతోనే సాధ్యం

**మేయర్ భాగ్యలక్ష్మి**



ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం ప్రజల సహకారంతోనే సాధ్యమని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వన్‌టౌన్, పంజాసెంటర్‌లో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజల సహకారంతో దేశంలోనే ఉత్తమ స్థానాలను స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్‌ను నగరపాలకసంస్థ అందుకుందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు అహర్నిశలు శ్రమిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం అభినందనీయమని అన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగరంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధించారని సూచించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ పర్యావరణానికి హాని కలిగిస్తాయని, భూమిలో కలవడానికి కొన్ని వందల ఏళ్లు పడుతుందని తెలిపారు. డ్రెయిన్‌లలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకూడదని చెప్పారు. అనంతరం వన్ ఎర్త్–వన్ లైఫ్ వారు పెట్టిన ప్రత్యేక స్టాల్‌ను వీక్షించారు. ప్రజలు ఇంటి వద్దనే ఎరువులు తయారు చేసే విధానంలో వారు చేస్తున్న కృషిని అభినందించారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డీ చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జీ సృజన, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పీ సత్యనారాయణ, పీ సత్య కుమారి, వన్ ఎర్త్–వన్ లైఫ్ అడ్మిన్ లీలాకుమారి బృందం, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

**కృష్ణలంకలో..**

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల వద్ద వీఎంసీ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం–పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ ర్యాలీ నిర్వహించారు. 20వ డివిజన్ కార్పొరేటర్, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపాశేషు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఈఈ సామ్రాజ్యం, ఏఈ నాగసాయి, 20, 21వ డివిజన్ల వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



చుట్టుగుంటలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుభ్రం చేస్తున్న ఏఈ వెంకట్రావ్, సిబ్బంది



స్టేషన్ పరిసరాలను శుభ్రం చేస్తున్న పటమట పోలీసులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రమేష్ ఆసుపత్రి రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శనివారం స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం జరిగింది. కళాశాల ఆవరణలోని పరిసరాలను అధ్యాపకులు, విద్యార్థులు శుభ్రం చేశారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామంటూ విద్యార్థులు, అధ్యాపకులతో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. విజయసారథి ప్రతిజ్ఞ చేయించారు. చుట్టుగుంటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్రా నిర్వహించారు. సబ్‌స్టేషన్ ఏఈ బీ వెంకట్రావ్, సిబ్బంది స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు.

పటమట(విజయవాడతూర్పు): పటమట పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఎస్ఐలు హరికృష్ణ, కృష్ణవర్మ, రేవతి పాల్గొన్నారు.

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్థానిక రామలింగేశ్వరనగర్ 71వ సచివాలయం పరిధిలోని గాంధీ కాలనీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ స్వచ్ఛాంధ్ర గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. స్పెషల్ ఆఫీసర్ సోమరాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదాం

**డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని**



నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో మొక్కను నాటుతున్న డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): మనం పనిచేసే ప్రదేశంతోపాటు, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుదామని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. స్వర్ణ ఆంధ్రా–స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని శనివారం ఆమె చేపట్టారు. ఇందులో భాగంగా కార్యాలయ ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత వస్తువులనే వినియోగిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డీపీఎంఓ డాక్టర్ నవీన్, గణాంక అధికారి లక్ష్మోజీ, ఆఫీసు సూపరింటెండెంట్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒడిశా యువతికి అరుదైన గుండె శస్త్రచికిత్స



మీడియా సమావేశంలో రోగితో పాటు వైద్య బృందం

లబ్బీపేట (విజయవాడ తూర్పు): పుట్టుకతోనే క్లిష్టతరమైన గుండె సమస్యలున్న ఒడిశాకు చెందిన 26 ఏళ్ల యువతికి విజయవాడలోని ఆస్టర్ రమేష్ ఆస్పత్రిలో క్లిష్టతరమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ భరత్ సిద్ధార్థ ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని జాజ్‌పూర్ జిల్లాకు చెందిన రీనాకు సెన్నింగ్ రిపేర్, కరెక్టెడ్ ట్రాన్స్‌పొజిషన్ ఆఫ్ ది గ్రేట్ ఆర్టరీస్, గుండె రక్తప్రవాహ మార్గాలు తప్పుగా అనుసంధానమై ఉన్నట్లు గుర్తించారు. ఇలా పలు సమస్యలున్న యువతికి క్లిష్టతరమైన శస్త్రచికిత్సను 12 గంటల పాటు శ్రమించి విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇది అత్యంత అరుదైన శస్త్రచికిత్స అని తెలిపారు. సమావేశంలో పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ జ్యోతిప్రకాష్, డాక్టర్ కే అనూష తదితరులు పాల్గొన్నారు.

# 27 నుంచి కంప్యూటర్ ట్రైనింగ్ సమ్మర్ క్యాంప్

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న కంప్యూటర్ ట్రైనింగ్ కేంద్రంలో ఈ నెల 27వ తేదీ నుంచి సమ్మర్ కంప్యూటర్ ట్రైనింగ్ క్లాసులు నిర్వహించనున్నట్లు కంప్యూటర్ విభాగం ఇన్‌చార్జి టీ క్రాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, సీ లాంగ్వేజ్, కోరల్ డ్రా, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. 45 రోజుల పాటు క్లాసులు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు పూర్తవుతున్న నేపథ్యంలో వేసవి సెలవుల్లో కంప్యూటర్ బేసిక్స్ నేర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీలోగా ఆసక్తి కలిగిన వారు రాఘవయ్య పార్కు సమీపంలోని తమ కార్యాలయంలో గానీ, 90145 41958, 73821 93413 నంబర్లలో గానీ సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

### సంగీతార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో వనిత సురేష్ బృందం శనివారం సంగీతార్చన నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై వనిత సురేష్ గాత్రకచేరీ భక్తులను విశేషంగా అలంకరించింది. వనిత సురేష్‌కు మల్లాది శివానంద్ మృదంగంపై, సింధు రాగేశ్వరి వయోలిన్‌పై వాద్య సహకారం అందించారు.

### దుర్గమ్మకు నృత్య నీరాజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో శనివారం విజయవాడకు చెందిన శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీకి చెందిన కళాబృందం నృత్య నీరాజనాలను అర్పించింది. నాట్యాచార్య చింతా వెంకట శివరామకృష్ణకుమార్ ఆధ్వర్యంలో 25మంది కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు వారికి ప్రసాదాలను అందజేశారు.



# 23న ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం మహాసభ



పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆటో, మోటారు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న తమ సంఘం 12వ నగర మహాసభను ఈ నెల 23వ తేదీన బందరురోడ్డు రాఘవయ్య పార్కు సమీపంలో ఉన్న మాకినేని బసవపున్నయ్య భవన్‌లో నిర్వహించనున్నట్లు ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర అధ్యక్షుడు డీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో మహాసభ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడను ఆటోలకు ఎటువంటి ఆంక్షలు లేని ఫ్రీ జోన్‌గా చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఏవిధమైన పోరాటాలు చేయాలనే విషయాలపై ఈ మహాసభల్లో చర్చిస్తామని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు డీ శ్రీధర్‌బాబు, పింగళి రమణ, రఫీఖాన్, యాదగిరి, సుబ్బారావు, వలి తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న పూర్ణిమ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ పూర్ణిమ పేర్కొన్నారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పూర్ణిమ మాట్లాడుతూ వస్తువును కొనుగోలు చేసిన తర్వాత వాటి సేవల విషయంలో ఏదైనా అసౌకర్యం కలిగితే వినియోగదారుల కోర్టులను ఆశ్రయించి నష్టపరిహారం పొందవచ్చునని తెలిపారు. వినియోగదారుడు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తప్పనిసరిగా అడిగి తీసుకోవాలని సూచించారు. జనశిక్షణ సంస్థాన్ రీసోర్స్ పర్సన్ భవానీదేవి, పీ వరలక్ష్మి, కే రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దేవినేని అవినాష్ జన్మదిన వేడుకలు



గుణదలలో కేక్ కట్ చేస్తున్న అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గుణదలలోని పార్టీ కార్యాలయంలో నేతలు కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచారు. పార్టీ ట్రేడ్ యూనియన్‌లో పాటు, అనుబంధ సంఘాల రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్పొరేటర్లు, మండల పార్టీ అధ్యక్షుడు, సోషల్ మీడియా కార్యకర్తలు, అభిమానులు కేక్‌కట్ చేశారు. కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, అనుబంధ విభాగాల అధ్యక్షులు గొట్టిపాటి హరీష్, చందా కిరణ్, ఏలూరి శివాజీ, సెటికం దుర్గాప్రసాద్, కోమల్‌సాయి, దండమూడి రాజేష్, పులిపాటి దుర్గారెడ్డి పాల్గొన్నారు.

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక 21వ డివిజన్‌లోని సత్యంగారి హోటల్ సెంటర్‌లో జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి పులిపాటి దుర్గారెడ్డి ఆధ్వర్యాన శనివారం జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ జన్మదినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, నాయకులు మేడా రమేష్, టీపీ రెడ్డి, పీ సాయి, సాయి కృష్ణారెడ్డి, గొర్ల గోవింద్, రమణారెడ్డి పాల్గొన్నారు.

# యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కోటిరెడ్డి

ఆటోనగర్(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈల ద్వారా వివిధ పథకాలకు రాయితీలు ఇస్తూ యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోందని కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి అన్నారు. ఆటోనగర్‌లోని ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు వారి ఆలోచనలతో నూతనంగా పరిశ్రమలను స్థాపించడం ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పించవచ్చని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఈఈ జీ మహేశ్వరరావు, పీ వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బీ వినోద్‌కుమార్, యువ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## ముగిసిన ఇంటర్ పరీక్షలు





ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ముగిశాయి. విద్యార్థులు చివరి రోజు పరీక్ష రాసి కేంద్రాల సంతోషంతో కేరింతలు కొడుతూ బయటకు వచ్చారు. రెండేళ్లు కలిసిమెలసి ఉన్న విద్యార్థులు ఒక పక్క సంతోషంగా, మరోపక్క ఫ్రెండ్స్‌ను విడిచిపోతున్నామనే బాధతో సొంత ఊర్లకు పయనమయ్యారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్ విద్యార్థులతో నిండిపోయింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ